సాక్షి
రాజన్న సిరిసిల్ల

శనివారం । 10 । జూన్ । 2023



క్రికెట్ విజేత రాజన్న జట్టు

వేములవాడ: దేవాదాయశాఖ నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో వేములవాడ రాజన్న జట్టు విజేతగా నిలిచింది. శుక్రవారం ఫైనల్స్‌లో రంగారెడ్డి జట్టుపై గెలుపొందింది.



ఐఎఫ్‌పీఎస్‌పై శిక్షణ

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాలోని 41 ఉన్నత పాఠశాలలకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ (డిజిటల్ టీవీలు) వినియోగంపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు.

గరిష్టం/కనిష్టం
41.0/30.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. వర్షం కురిసే అవకాశం లేదు. ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

రేపు సిరిసిల్లలో కవి సమ్మేళనం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

సిరిసిల్ల: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సిరిసిల్లలో కవి సమ్మేళనం నిర్వహిస్తున్నామని కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం కవి సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయంలో ఉదయం 10 గంటలకు కవిసమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 'తెలంగాణ అస్తిత్వం.. తెలంగాణ ప్రగతి' అనే అంశంపై సమ్మేళనం ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి పీబీ శ్రీనివాసాచారి, డీపీఆర్వో ఎం.దశరథం పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాలలో పీఆర్టీ కమిటీ సభ్యులు



వివరాలు తెలుసుకుంటున్న కమిటీ సభ్యులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలంలోని జిల్లెల్లలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాలను జాతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ పీఆర్టీ కమిటీ సభ్యులు శుక్రవారం సందర్శించారు. 2018లో స్థాపించిన కళాశాల ఐకార్ గుర్తింపు కోసం ప్రయోగశాలలు, వసతిగృహాలు, భవనాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. కమిటీ సభ్యులు సరియాల్, గోస్వామి, ముంద్రా, హేమాత్రిపాటి, అమిత సక్సేనా, వ్యవసాయ విశ్వవిద్యాలయ అధికారులు వెంకటరమణ, సీమ, సత్యనారాయణ, సుధాకర్, కళాశాల అసోసియేట్ డీన్ ఉమామహేశ్వరి ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



సిరిసిల్లలో బడిబాటలో డీఈవో, టీచర్లు

సిరిసిల్లటౌన్/ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని డీఈవో రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. సిరిసిల్లలోని గీతానగర్‌లోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో శుక్రవారం బడిబాట నిర్వహించారు. డీఈవో రమేశ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు వంద మంది నూతనంగా అడ్మిషన్లు తీసుకున్నట్లు తెలిపారు. కౌన్సిలర్ దేవదాస్, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీధర్, వైస్‌చైర్మన్ రూపిక, హెచ్ఎంలు భాగ్యరేఖ, విద్యాసాగర్ తదితరులు ఉన్నారు.

పనుల పరిశీలన

ఎల్లారెడ్డిపేటలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మనఊరు–మనబడిలో భాగంగా నిర్మిస్తున్న భవనం పనులను శుక్రవారం డీఈవో రమేశ్‌కుమార్ పరిశీలించారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని సూచించారు. ఈనెల 12వ తేదీ వరకు భవనాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం బడిబాటలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం జిల్లాలోని అన్ని పాఠశాలల్లో వసతులు కల్పించి విద్యార్థులకు డిజిటల్ బోధన చేస్తున్నామన్నారు. హెచ్ఎం దబ్బెడ హన్మండ్లు, కుబేరస్వామి, గివ్ తెలంగాణ ఫౌండేషన్ ప్రతినిధి శిరీష్ పాల్గొన్నారు.

ట్రాక్టర్లపై స్పెషల్ డ్రైవ్

సిరిసిల్లక్రైం: నంబర్ ప్లేట్ లేకుండా ఇష్టారీతిగా నడుస్తున్న ట్రాక్టర్స్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన ఎస్పీ అఖిల్ మహాజన్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 513 ట్రాక్టర్స్, ట్రాలీలు నంబర్ ప్లేట్ లేకుండా రోడ్డు మీదకు వస్తున్నట్లు గుర్తించామన్నారు. సంబంధిత వాహన యజమానులకు, డ్రైవర్స్ అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. ఇకపై నంబర్ ప్లేట్ లేకుండా వాహనం నడిపిన, నంబర్ ప్లేట్ దాచినా, నంబర్లు తొలగించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. డ్రైవింగ్‌లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

మొక్కే కదా.. అని పీకేస్తే..



ఈ చిత్రంలో మొక్కలు నరికివేస్తున్న వ్యక్తి ఎల్లారెడ్డిపేట నివాసి. మండల కేంద్రంలో తన భవనానికి అడ్డుగా ఉన్నాయని హరితహారంలో నాటిన మొక్కలను అనుమతులు తీసుకోకుండానే తొలగించారు. దీనిపై పత్రికల్లో వార్తలు రావడంతో పంచాయతీ అధికారులు స్పందించి జరిమానా విధించారు.



- చెట్లు నరికితే జరిమానాలు
- జిల్లాలో 6 నెలల్లో 36 మందికి ఫైన్లు
- నిర్లక్ష్య అధికారులపై వేటు
- 3.87 కోట్ల మొక్కలు నాటిన అధికారులు
- బతికినవి 3.15 కోట్లు
- జీపీలదే సంరక్షణ బాధ్యత
- తొలగిస్తే క్రిమినల్ కేసులు : అధికారులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాష్ట్ర ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. నాటిన ప్రతీ మొక్కను బతికించుకోవడానికి అహర్నిశలు అధికారులు, పంచాయతీ సిబ్బంది శ్రమిస్తున్నారు. మొక్కలు ఏపుగా పెరిగి పల్లెలకు పచ్చదనంతో స్వాగతం పలుకుతుండగా, కొందరు వారి స్వార్థ ప్రయోజనాల కోసం మొక్కలపై గొడ్డలివేటు వేస్తున్నారు. దీన్ని జిల్లా అధికార యంత్రాంగం సీరియస్‌గా పరిగణించి జరిమానాలు విధించడమే కాకుండా క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా మొక్కలు నరికివేసిన 36 మందికి పంచాయతీ అధికారులు జరిమానాలు విధించారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న అధికారులను సైతం సస్పెండ్ చేశారు. మొత్తంగా మొక్కల సంరక్షణే ప్రధాన లక్ష్యంగా అధికారులు ముందుకెళ్తున్నారు.



నారాయణపూర్‌లో ఏపుగా పెరిగిన మొక్కలు

క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం



హరితహారం మొక్కలు, వృక్షాలను అనుమతులు లేకుండా తొలగిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. అత్యవసరమైతే తొలగించడానికి ఇంటి యజమానులు సంబంధిత జీపీలలో దరఖాస్తులు చేసుకోవాలి. అలాకాకుండా చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని మొక్కలను నరికివేస్తే ఉపేక్షించేది లేదు.

– చిరంజీవి, ఎల్లారెడ్డిపేట, ఎంపీడీవో

ఏడు విడతల్లో 3.87 కోట్ల మొక్కలు

జిల్లా వ్యాప్తంగా ఏడు విడతల్లో హరితహారంలో భాగంగా అధికారులు 3.87 కోట్ల మొక్కలు నాటారు. వివిధ కారణాలతో కొన్ని మొక్కలు చనిపోగా.. ప్రస్తుతం 3.15 కోట్ల మొక్కలు బతికి ఉన్నాయి. ప్రధాన రహదారులు, పొలంగట్లు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల ఆవరణలలో నాటిన మొక్కలు నేడు వృక్షాలుగా మారాయి. అవి ఈ స్థాయికి రావడానికి ఉపాధిహామీ సిబ్బందితోపాటు గ్రామ పంచాయతీ అధికారులు అహర్నిశలు కష్టపడ్డారు. మొక్కల సంరక్షణపై నిత్యం జిల్లా స్థాయి అధికారులు పర్యవేక్షించడంతోనే గ్రామాల్లో నేడు పచ్చదనం పరిఢవిల్లుతోంది. ఈ నేపథ్యంలో కంటికి రెప్పలా కాపాడిన మొక్కలను నరికివేస్తున్న వ్యక్తులపై అధికారులు సీరియస్ చర్యలు తీసుకుంటున్నారు. ముస్తాబాద్‌లో మొక్కలను తిన్న మేకలను గ్రామపంచాయతీలో బంధించి యజమాని నుంచి రూ.2వేలు జరిమానా తీసుకోవడం మొక్కల సంరక్షణపై అధికారుల తీరును స్పష్టం చేస్తోంది.

6 నెలలు.. 36 మందికి జరిమానాలు

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో రహదారుల వెంట ఏర్పాటు చేసిన ఎవెన్యూప్లాంట్ల మొక్కలే నరికివేతకు గురవుతున్నాయి. భవన నిర్మాణాలకు అడ్డుగా వస్తున్నాయనే ప్రధాన కారణంతో రాత్రికి రాత్రే చెట్లను తొలగిస్తున్నారు. దీన్ని గుర్తించిన అధికారులు ఆరు నెలల వ్యవధిలో జిల్లా వ్యాప్తంగా 36 సంఘటనలలో జరిమానాలు విధించారు. అంతేకాకుండా మొక్కల సంరక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులను సస్పెండ్ చేస్తున్నారు. ఉదాహరణకు ఇటీవల ఎల్లారెడ్డిపేటలో రోడ్ల వెంట నాటిన మొక్కలకు నీరు పట్టకపోవడంతో అవి ఎండిపోయినట్లు గుర్తించిన కలెక్టర్ పంచాయతీ ఈవో ప్రవీణ్‌కుమార్‌ను సస్పెండ్ చేశారు. మొక్కల సంరక్షణే బాధ్యతగా నిర్లక్ష్యంగా చేసే అధికారులపై వేటు వేయడంతోపాటు నరికివేస్తున్న వారికి జరిమానాలు విధించడమే కాకుండా క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నారు.

కూర రాజన్నను రాజ్యం చంపాలని చూస్తోంది

- జనశక్తి జిల్లా నాయకుడు కిరణ్

సిరిసిల్ల: సీపీఐ(ఎంఎల్) జనశక్తి అగ్రనాయకుడు కూర రాజన్నను రాజ్యం చంపాలని చూస్తోందని జనశక్తి జిల్లా నాయకుడు కిరణ్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. పోలీసులు రాజన్నపై నమోదు చేసిన అక్రమ కేసుల విషయంలో కోర్టుకు హాజరవుతూ.. కోర్టు షరతుల మేరకు వేములవాడలో ఉంటే.. రాజన్నను కలిసే వారిని పోలీసులు వేధిస్తున్నారని కిరణ్ ఆరోపించారు. అనారోగ్యంతో రాజన్న ఇద్దరు మనుషులు లేనిదే కదిలే పరిస్థితి లేదని.. 12 రకాల ఆపరేషన్లు అయ్యాయని పేర్కొన్నారు. రాజన్న పిటిషన్లతో కోర్టు కూడా షరతుల నుంచి మినహాయింపు ఇస్తే వేములవాడ పోలీసులు వేధిస్తున్నారని తెలిపారు. సిరిసిల్లకు చెందిన పోకల సాయికుమార్‌ను, వేములవాడకు చెందిన మానుక కుంటయ్యను అక్రమంగా అరెస్ట్ చేశారని, జనశక్తి రాజన్నకు సహకరిస్తున్నారనే తప్పుడు కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామిక వాదులు, మేధావులు, పౌర సంఘాలు అక్రమ అరెస్టులను ఖండించాలని, పోలీసుల అణచివేతకు వ్యతిరేకంగా ఉద్యమించాలని కిరణ్ పిలుపునిచ్చాడు. అక్రమ కేసులను ఎత్తివేయాలని, ప్రజాసమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు.

వైభవంగా కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ: రాజన్న ఆలయ అనుబంధ శ్రీవేణుగోపాలస్వామి కల్యాణం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 11.55 గంటలకు బ్రాహ్మణోత్తముల మంత్రోచ్ఛరణల మధ్య రెండు గంటలపాటు కల్యాణోత్సవం జరిగింది. కన్యాదాతలుగా రాచకొండ భాను దంపతులు, పర్యవేక్షకులు హరినాథ్, అర్చకులు ఉమేశ్, నమిలికొండ రాజేశ్వర్, చంద్రగిరి శరత్‌శర్మ పాల్గొన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో కల్యాణోత్సవానికి భక్తులు హాజరుకాలేదు.

సబ్బండ వర్గాలకు సంక్షేమం

- రైతుబంధు, దళిత బంధుతో విప్లవాత్మక మార్పులు
- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ
- తెలంగాణ పథకాలే దేశానికి స్ఫూర్తి
- టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు



లబ్ధిదారులకు గొర్రెలు అందిస్తున్న నాయకులు

సిరిసిల్ల: సబ్బండ వర్గాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. సిరిసిల్ల పద్మనాయక కల్యాణ మండపంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సంక్షేమ సంబురాలు నిర్వహించారు. అరుణ మాట్లాడుతూ స్వరాష్ట్రం సాధించిన తర్వాత అందరి సంక్షేమానికి అనేక పథకాలు ప్రారంభించి అమలు చేస్తున్నారన్నారు. రైతుబంధు ద్వారా ఏటా ఎకరానికి రూ.10వేలు అందిస్తూ రైతులకు అండగా నిలిచారని వివరించారు. జిల్లాలో 1.20 లక్షల మంది రైతులకు రూ.1,202.85 కోట్ల సాయాన్ని అందించామన్నారు. రైతుబీమా ద్వారా 1,741 కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున రూ.87.10 కోట్ల ఆర్థిక సాయం అందించినట్లు వివరించారు. జిల్లాలో దళితబంధు పథకంలో 206 కుటుంబాలకు రూ.20.60 కోట్లు అందించినట్లు పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలే దేశానికి స్ఫూర్తిగా నిలుస్తున్నాయని టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పేర్కొన్నారు. రైతులకు 24 గంటల విద్యుత్‌ను ఉచితంగా ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ అన్నారు. లబ్ధిదారులకు గొర్రెలను పంపిణీ చేసి, బీసీలకు రూ.లక్ష ఆర్థిక సాయం చెక్కులను, నిరుద్యోగులకు ఉపాధి కల్పన పథకాలను అందించినట్లు పేర్కొన్నారు. టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, రైతుబంధు సమితి చైర్మన్ గడ్డం నర్సయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వినోద్, బీసీ వెల్ఫేర్ అధికారి రాఘవేందర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎంపీపీలు పడిగెల మానస, పిల్లి రేణుక, జనగామ శరత్‌రావు, వంగ కరుణ, మాలోత్ భూలా, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, గుండం నర్సయ్య, గుగులోత్ కళావతి, కె.విజయ, సెస్ డైరెక్టర్లు నారాయణరావు, అంజిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ బండి దేవదాస్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సరిత తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ వ్యవస్థ బలోపేతం





మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్‌మహాజన్, హాజరైన విద్యార్థులు

- అత్యాధునిక వాహనాలు.. ఆధునిక సాంకేతికత
- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: రాష్ట్రం ఏర్పడ్డాక పోలీస్‌శాఖలో అనేక సంస్కరణలు వచ్చాయని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఫ్రెండ్లీ పోలీసింగ్ విజయవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సిరిసిల్లలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నాడు–నేడు నిర్వహించారు. ఏ ప్రాంతంలోనైన అభివృద్ధి జరగాలంటే శాంతి భద్రతలు కీలకమన్నారు. అప్పుడే పెట్టుబడులు వస్తాయన్నారు. ఒక డీఎస్పీ స్థాయి అధికారి పరిధిలో ఉన్న సిరిసిల్ల ప్రస్తుతం ఎస్పీ స్థాయి, ఒక అడిషనల్ ఎస్పీ, నలుగురు డీఎస్పీ స్థాయి అధికారులు జిల్లాలో శాంతిభద్రతలను పర్యవేక్షించడంలో భాగస్వామ్యమయ్యారన్నారు. డయల్ 100 ద్వారా జిల్లాలో ఏ ప్రాంతంలోనైనా ఐదు నిమిషాల్లో పోలీస్ బృందాలు రక్షణ కల్పిస్తున్నాయని తెలిపారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలపై సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ రవికుమార్, సీఐ అనిల్‌కుమార్, ఉపేందర్, నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

జగిత్యాల జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ హబ్

- 195 ఎకరాల్లో భారీ స్పెషల్ జోన్
- మెట్‌పల్లి సమీపంలో 40 పరిశ్రమల కోసం సదుపాయాలు
- రూ.40 కోట్లతో టీఎస్ఐఐసీ ఆధ్వర్యంలో పనులు
- అక్టోబరు ఒకటిన సీఎం లేదా కేటీఆర్ చేత పనులు ప్రారంభం
- జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులపై కన్ను
- ఇప్పటికే ఆసక్తి చూపించిన భువి, ధాత్రి సంస్థలు
- కరోనా, ఉక్రెయిన్ సంక్షోభాలతో వ్యవసాయోత్పత్తులకు డిమాండ్



మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్ ఫుడ్ ప్రాసెస్ జోన్ ప్లాన్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి జిల్లాలో భారీఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ రానుంది. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం మెట్ల చిట్టాపూర్ వద్ద 'స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్' ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. కరోనా, ఉక్రెయిన్ యుద్ధం తర్వాత ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ ఉత్పత్తులకు పెరిగిన డిమాండ్‌ను అనుకూలంగా మలుచుకునే యోచనలో తెలంగాణ సర్కారు ఉంది. అందుకే, ఈ ఫుడ్‌ప్రాసెసింగ్ జోన్ కోసం.. 195 ఎకరాల భూమిని కేటాయించింది. ఎంపిక చేసిన భూమిలో మౌలిక సదుపాయాల కల్పనలో తలమునకలైంది. ఈస్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌లో కీలకమైన రోడ్లు, విద్యుత్తు, నీరు తదితర ముఖ్యమైన మౌలిక సదుపాయాలు కీలకం. అందుకే వీటిని వీలైనంత త్వరగా ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర పరిశ్రమలు, మౌలిక సదుపాయాల సంస్థ(టీఎస్ఐఐసీ) పట్టుదలగా ఉంది. పార్క్ అభివృద్ధికి సంబంధించిన బ్లూప్రింట్ ప్రకారం వసతులు కల్పిస్తోంది.

రూ.40 కోట్లతో సదుపాయాలు..

మెట్‌పల్లి మండలం మెట్ల చిట్టాపూర్‌ను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ఈ ప్రాంతం భౌగోళికంగా ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలకు మధ్యలో ఉంది. అందుకే ఈ ప్రాంతాన్ని ఎంచుకున్నారు. ఫుడ్‌ప్రాసెసింగ్ జోన్ పారిశ్రామిక అవసరాలకు కావాల్సిన నీటిని అందించేందుకు వరద కాల్వ, సరుకు రవాణాకు రోడ్డు, రైలు మార్గాలు అందుబాటులో ఉన్నాయి. అంతేకాకుండా.. వ్యవసాయంపరంగా ఈ మూడు పాత జిల్లాల్లో కరీంనగర్‌లో వరి, మొక్కజొన్న, మామిడి, నిజామాబాద్‌లో చెరుకు, మొక్కజొన్న, పసుపు, ఆదిలాబాద్‌లో వరితోపాటు పత్తి బాగా పండుతాయి. ఈ పంటలతోపాటు వాటి ద్వారా ఉత్పత్తి అయ్యే బై ప్రోడక్టులను సద్వినియోగం చేసుకోవాలన్న ఉద్దేశంతో ఈ ప్రాంతంలో స్పెషల్ ఫుడ్‌ప్రాసెసింగ్ జోన్‌ను అభివృద్ధి చేస్తున్నారు. మొత్తం 194.67 ఎకరాల్లో రూ.40 కోట్ల నిధులతో ఇక్కడ 'స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్‌జోన్' నిర్మిస్తారు. ప్రస్తుతం ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ కోసం ఎంపిక చేసిన ప్రాంతంలో టీఎస్ఐఐసీ మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సమాయత్తం అవుతోంది. ప్రధానంగా విద్యుత్తు, రోడ్లు, నీరు తదితర సదుపాయాలకు కావాల్సిన పనులను చేపడుతోంది. ఈ పార్క్ నిర్మాణ పనులు అధికారికంగా అక్టోబరు ఒకటిన ప్రారంభం కానున్నాయి.

పెట్టుబడులు ఆకర్షించేలా..

ప్రస్తుతం ఉన్న సమాచారం ప్రకారం.. స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌లో ఉన్న భూమిలో ప్లాటింగ్ కోసం ప్లాన్ గీశారు. స్థానిక వ్యవసాయ ఉత్పత్తుల లభ్యత ఆధారంగా జాతీయ, అంతర్జాతీయ కంపెనీలను ఆకర్షించే పనిలో పరిశ్రమలశాఖ ఉంది. అందుకు అనుగుణంగా దాదాపు 40 వరకు చిన్న, పెద్దతరహా పరిశ్రమల కోసం కనిష్టంగా రెండు ఎకరాల నుంచి గరిష్టంగా పది ఎకరాల వరకు పరిశ్రమలు స్థాపించుకోవచ్చు. ఆ విధంగా ప్లాటింగ్‌ను మార్కింగ్ చేసిన టీఎస్ఐఐసీ అధికారులు.. పరిశ్రమ సామర్థ్యాన్ని బట్టి ఇందులో మార్పులు కూడా చేసే వీలుందని తెలిపారు. అందులో భాగంగానే ఇక్కడ ఇథనాల్ తయారీ పరిశ్రమల ఏర్పాటుకు పలువురు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ పార్క్ ఏర్పాటును పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ తొలిసారిగా ప్రకటించారు. అదే సమయంలో భువి కెమికల్స్ ఆధ్వర్యంలో రూ.1,040 కోట్ల వ్యయంతో రోజుకు లక్ష లీటర్ల ఇథనాల్ సామర్థ్యంతో ఫ్యాక్టరీ ఏర్పాటుకు ఆసక్తి చూపించింది. ధాత్రి బయో సొల్యూషన్స్ ఆధ్వర్యంలో సిలికా ఉత్పత్తి కోసం రూ.160 కోట్ల వ్యయంతో పరిశ్రమ స్థాపించేందుకు ఆసక్తి కనబరిచారు. దీనితోపాటు బయోగ్యాస్ ఉత్పత్తి చేయాలన్న ఆలోచనలో ఉన్నారని సమాచారం.

ఇక్కడే ఎందుకు?

ఉమ్మడి రాష్ట్రం ఏర్పాటు నుంచే కరీంనగర్ జిల్లా వరి ఉత్పత్తిలో అగ్రగామిగా నిలిచింది. తెలంగాణ ఏర్పాటు తర్వాత వరి ఉత్పత్తి మరింత పెరిగింది. కరీంనగర్ జిల్లాలో 2.71 లక్షల ఎకరాలు, సిరిసిల్లలో 1.71 లక్షల ఎకరాలు, పెద్దపల్లిలో 2 లక్షల ఎకరాలు, జగిత్యాల జిల్లాలో దాదాపుగా 2.97 ఎకరాలు మొత్తంగా 9.39 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. ఈ జిల్లాల్లో దాదాపు 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వరకు ఉత్పత్తి అవుతోంది. ఉమ్మడి జిల్లాలో ఇథనాల్‌ను వరిగడ్డి, నూకలు, చెరుకు, మొక్కజొన్న నుంచి తీస్తారు. దీంతో మెట్లచిట్టాపూర్ పరిసర జిల్లాల నుంచి ఉత్పత్తి అయిన ప్రతీ వ్యవసాయ ఉత్పత్తిని ఇక్కడ ప్రాసెస్ చేసేందుకు లేదా ఇథనాల్ తదితరాలు ఉత్పత్తి చేసేందుకు ఉపయోగపడుతాయి. కరోనా సంక్షోభం, ఉక్రెయిన్ యుద్ధం తర్వాత దేశంలో వరి, నూకలు, తౌడు, ఉనుకకు విపరీతంగా డిమాండ్ పెరిగింది. ఈ పరిస్థితిని తెలంగాణ ప్రభుత్వం అనుకూలంగా మార్చుకునే యోచనలో ఉంది. అంతేకాకుండా వరి ధాన్యాన్ని ఆడించగా వచ్చే ఉనుక, తౌడు, పరం తదితరాలతోనూ ఇక్కడ బ్రాన్ ఆయిల్, బిస్కట్ తదితర పరిశ్రమలను సైతం నిర్మించవచ్చు.

క్లుప్తంగా

ఎల్లారెడ్డిపేట ఎస్సై బదిలీ


శేఖర్,ఎస్సై

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న శేఖర్ బదిలీపై వెళ్లినట్లు తెలిసింది. బదిలీ విషయాన్ని జిల్లా ఎస్పీ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఇక్కడ పనిచేస్తున్న ఎస్సై శేఖర్ మెదక్ జిల్లాకు బదిలీ అయినట్లు తెలిసింది. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాకు చెందిన శేఖర్ ఇంటికి దగ్గరలో ఉండేలా పోస్టింగ్ కోసం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఇంటికి దూరంగా మెదక్ జిల్లాకు బదిలీ కావడంతో అక్కడికి వెళ్లడానికి సుముఖంగా లేనట్లు తెలిసింది. ప్రస్తుతం శేఖర్ సెలవులో ఉన్నారు. జిల్లాలో ఎస్సైల బదిలీలు లేకుండానే కేవలం ఎల్లారెడ్డిపేట ఎస్సై మాత్రమే బదిలీ కావడం విశేషం. త్వరలోనే జిల్లా వ్యాప్తంగా ఎస్సైల బదిలీలు ఉంటాయని పోలీసు వర్గాలు పేర్కొంటున్నారు.

తాటి, ఈత వనం దగ్ధం



సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరులోని బొత్తలగడ్డ దగ్గర శుక్రవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని తాటి, ఈతవనాలు దగ్ధమయ్యాయి. గీతకార్మికులు చెప్పిన వివరాల ప్రకారం గ్రామంలోని కొందరు రైతులు వరికొయ్యలు కాల్చివేయగా, మంటలు చెలరేగి పక్కనే ఉన్న తాటి, ఈత చెట్లకు అంటుకున్నాయి. మంటలు వనం అంతటా వ్యాప్తి చెందడంతో వందలాది తాటి, ఈత చెట్లు కాలిపోయినట్లు తెలిపారు. తాటి, ఈత చెట్లు కాలిపోవడంతో తాము తీవ్రంగా నష్టపోయామని ప్రభుత్వం ఆదుకోవాని కోరుతున్నారు.

ఆంగ్లంపై పట్టుసాధించిన విద్యార్థులు



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): నలభై రోజుల స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణతో విద్యార్థులు మంచి పట్టుసాధించారని మండల విద్యాధికారి దూస రఘుపతి పేర్కొన్నారు. వెంకటాపూర్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మనఊరు–మనబడిలో భాగంగా 40 రోజులపాటు నిర్వహించిన స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ముగింపు సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయిని ఎండీ తైసిన్ విద్యార్థులకు ఇంగ్లిష్ నేర్పించారని కొనియాడారు. పీడీ రవీందర్, ఎండీ సలావుద్దీన్, శ్రీనివాస్, శంకరమ్మ, ఆరాధన, ఉదయశ్రీ, ఎస్ఎంసీ చైర్మన్ బోయిని రాధ పాల్గొన్నారు.

వేములవాడలో మూడు బైక్‌లు చోరీ

వేములవాడ: వేములవాడలో మూడు బైక్‌లు చోరీకి గురయ్యాయి. రాజన్న గుడి ముందు పార్క్ చేసిన పారువెల్ల శ్రీనాథ్, బస్టాండు వద్ద పార్క్‌చేసిన జునేద్, బస్టాండులోనే మరో రెండు బైక్‌లను గుర్తుతెలియని దొంగలు ఎత్తుకెళ్లినట్లు వాహన యజమానులు తెలిపారు. ఈమేరకు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

విదేశీ ఉద్యోగ మేళాకు స్పందన

- నాలుగు జిల్లాల నుంచి హాజరైన 130 మంది
- ప్రత్యేక ఇంటర్వ్యూ అనంతరం వివరాల నమోదు
- వారం రోజుల్లో సమాచారమిస్తామని వెల్లడి


ఉద్యోగ మేళాకు హాజరైన నిరుద్యోగులు

రామగుండం: విదేశాల్లో ఉద్యోగాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో రామగుండంలోని ఐటీఐలో శుక్రవారం ఏర్పాటు చేసిన విదేశీ ఉద్యోగ మేళాకు స్పందన వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కాం) ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యోగ మేళాకు నాలుగు జిల్లాల నుంచి 130 మంది హాజరయ్యారు. వీరికి ప్రత్యేక ఇంటర్వ్యూ నిర్వహించి వివరాలు నమోదు చేసుకున్నారు. వారం రోజుల్లోగా సమాచారం ఇస్తామని వెల్లడించారు.

ఇంటర్వ్యూలు నిర్వహించిన ఉద్యోగాల వివరాలు..

ఆస్ట్రేలియాలో ప్లాంట్ మెకానిక్, మెకానికల్ ఫిట్టర్, మెకానికల్ ఇంజినీర్, వెల్డర్, బైలర్ మేకర్, ఫ్యాబ్రికేటర్, జర్మనీలో ఆస్‌బిల్డంగ్ ప్రోగ్రామ్స్, కన్‌స్ట్రక్షన్స్, ఫుడ్ ప్రాసెసింగ్ (నాన్ వెజ్), రిటైల్ సేల్స్, వేర్‌హౌస్ క్లర్క్, ట్రక్ డ్రైవర్స్, వెసెల్ కంటైనర్ మేకింగ్, పోలాండ్‌లో వెల్డర్స్, ఫిట్టర్స్, యూఏఈలో ఫోర్‌మెన్ ప్లాంటర్, మెషినిస్ట్, మెకానికల్, వర్క్ ప్రిపరేటర్ పైపింగ్, వర్క్ ప్రిపరేటర్–స్ట్రక్చరల్, ఫోర్‌మెన్ రబ్బర్ ప్రొపెల్లర్, ప్లాటర్ ఫ్యాబ్రికేటర్, పైపింగ్ సూపర్‌వైజర్, బ్లాస్టింగ్, వెల్డర్, ఫోర్‌మెన్ మెకానికల్ తదితర ఖాళీలకు అభ్య నుంచి ఇంటర్వ్యూ నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు.

అబ్రాడ్‌లో ఉద్యోగం చేయాలని..



నేడు డిగ్రీ చదివా. ప్రస్తుతం హెవీ వెహికల్ డ్రైవర్‌గా పనిచేస్తున్న. ఉద్యోగం చేయాలనే కోరిక ఉంది. పత్రికల్లో వచ్చిన ప్రకటనను చూసి ఇంటర్వ్యూకు వచ్చా. ధ్రువీకరణపత్రాలు సమర్పించ. మూడురోజుల్లో కాల్ చేస్తామన్నారు. – ఎండీ.సాజిద్ అహ్మద్, మంచిర్యాల

ఆస్ట్రేలియాలో ఉద్యోగం కోసం..



నేను మైనింగ్‌లో ఇంజినీరింగ్ డిగ్రీ పూర్తి చేశా. ప్రస్తుతం ప్రైవేటుగా జాబ్ చేస్తున్న. విదేశాల్లోని మైనింగ్ కంపెనీల్లో ఉద్యోగం చేయాలని ఉంది. టామ్‌కాం ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్వ్యూకు హాజరయ్యా. ఆస్ట్రేలియాలో ఉద్యోగం చేయాలనే విషయాన్ని వారికి తెలిపా. – శ్రీవెంకటేశ్వర, గుంజపడుగు. పెద్దపల్లి జిల్లా

ఆఫ్రికాలో ఉద్యోగం కల్పించాలని..



నేను ఐటీఐలో ఫిట్టర్ పూర్తి చేసి గోదావరిఖనిలో అప్రెంటిషిప్ చేస్తున్న. విదేశాల్లో ఉద్యోగ ప్రకటన చూసి ఇంటర్వ్యూకు వచ్చా. పెళ్లికి ముందే ఐదేళ్లు విదేశాల్లో ఉద్యోగం చేసి వస్తే ఆర్థికంగా బాగుంటుంది. ఆఫ్రికా దేశంలో ఉద్యోగం కల్పించాలని కోరా. – బండారి అవినాశ్, ఖమ్మం

ఇంటర్వ్యూకు రావడం మొదటిసారి



నేడు ఐటీఐలో ఎలక్ట్రిషియన్ పూర్తి చేసి మంచిర్యాల సింగరేణి కాలరీస్‌లో అప్రెంటిషిప్ చేస్తున్న. నా అర్హతకు సంబంధించి ఆస్ట్రేలియా, జర్మనీ దేశాల్లో ఉన్న ఉద్యోగ ఖాళీలకు దరఖాస్తు చేశా. అబ్రాడ్‌లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూకు రావడం ఇదే మొదటిసారి. – తుమ్మ వైష్ణవి, మంచిర్యాల

తగిన ఉద్యోగం వస్తే చాలు



నేను బీఎస్సీ (ఎంసీసీఎస్) చదివా. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఏజెన్సీ టామ్‌కాం కావడంతో నమ్మకంతో విదేశాల్లో ఉద్యోగానికి దరఖాస్తు చేసుకునేందుకు వచ్చా. వివరాలన్నీ నమోదు చేసుకొని పది రోజుల్లోగా సమాచారం ఇస్తామన్నారు. – మేర్గు సాగర్‌గౌడ్, పెద్దంపేట, పెద్దపల్లి జిల్లా

15 ఏళ్లు అరబ్ దేశాల్లో పనిచేశా



నేను పదిహేనేళ్లు వివిధ అరబ్ దేశాల్లో పనిచేసి కొన్ని పనుల నిమిత్తం ఇండియాకు తిరిగి వచ్చా. ప్రస్తుతం నాన్ అరబ్ దేశాల్లో ఉద్యోగం చేయాలని నిర్ణయించుకున్న. నా అర్హత, విదేశాల్లో చేసిన పనులు తదితర ధ్రువీకరణపత్రాలు అందజేశా. – ఎండీ.సాధిఖ్, సిరిసిల్ల

అర్హతలున్న వారందరికీ ఉద్యోగం కల్పిస్తాం



ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హతలున్న వారందరికీ విదేశాల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తాం. మేళాకు వచ్చిన వారి నుంచి స్వీకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తాం. పరిశీలించి మళ్లీ ఇంటర్వ్యూకు ఆహ్వానిస్తాం. విదేశాల్లో ఉద్యోగం చేయాలనుకునే వారు ప్రయివేటు కన్సల్టెంట్లను ఆశ్రయించి మోసపోకుండా ప్రభుత్వ పక్షాన నిర్వహించే మేళాకు హాజరైతే తక్కువ ఖర్చుతో వెళ్లొచ్చు. – శ్రావణి తలశిల, హెచ్‌ఆర్ మేనేజర్, టామ్‌కాం

సగర్వంగా సంబురాలు

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్


చెక్కు అందజేస్తున్న వినోద్‌కుమార్

వేములవాడ: కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, సగర్వంగా దశాబ్ది ఉత్సవాలు నిర్వహించుకుంటున్నామని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. వేములవాడలోని ఎస్సారార్ ఫంక్షన్‌హాలులో శుక్రవారం లబ్ధిదారులకు చెక్కులు, గొర్రెల పంపిణీ, బీసీబంధు, పట్టాల పంపిణీ, సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పంపిణీ, మైనార్టీ రుణాలు అందించి మాట్లాడారు. రానున్న పదేళ్లలో ప్రణాళికాబద్ధంగా సంక్షేమమే సింహభాగంగా నిధులు ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. అప్పులు తెచ్చినప్పటికీ ప్రభుత్వం సంపదను సృష్టిస్తుందన్నారు. సమైక్య రాష్ట్రంలో మూడు మాత్రమే మెడికల్ కాలేజీలు ఉండేవని, ఇప్పుడు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని నాలుగు జిల్లాల్లో ఒక్కో మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు మాట్లాడుతూ సంక్షేమ పథకాలను సుపరిపాలన ద్వారా ప్రజలకు అందిస్తున్నామన్నారు. కలెక్టర్ అనురాగ్ జయంతి, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు పాల్గొన్నారు.

జిల్లాలో జలశక్తి అభియాన్ బృందం

- నీటిశుద్ధి, మురికినీటి నిర్వహణ పరిశీలన


జంగంరెడ్డిపల్లిలో ప్రజలతో జలశపథం చేయిస్తున్న కేంద్ర ప్రభుత్వ అధికారులు

సిరిసిల్ల/తంగళ్లపల్లి/ఇల్లంతకుంట: జిల్లాలో కేంద్ర ప్రభుత్వ జలశక్తి అభియాన్ అధికారుల బృందం శుక్రవారం పర్యటించింది. సిరిసిల్ల పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్‌లో అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్‌తో సమావేశమైన అధికారులు జిల్లాలో చేపట్టిన జలసంరక్షణ, తడి, పొడి చెత్త సేకరణపై చర్చించారు. జిల్లాలో చేపట్టిన పనులను జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, మిషన్ భగీరథ ఈఈ విజయ్‌కుమార్, జానకి, భూగర్భ జలశాఖ అధికారి నర్సింహులు కేంద్ర బృందానికి వివరించారు. అనంతరం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని డంపుయార్డు, తడి, పొడి చెత్త సేకరణను పరిశీలించారు. అగ్రహారంలోని నీటిశుద్ధి ప్లాంటును, సిరిసిల్లలో మురికినీటి శుద్ధి ప్లాంటును, తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల పల్లె ప్రకృతివనం, అంతగిరి అన్నపూర్ణ రిజర్వాయర్, ఎత్తిపోతల పంపులను, జంగంరెడ్డిపల్లెలో ఇంకుడుగుంతలు, మిషన్ భగీరథ నీటి సరఫరా, నర్సింగాపూర్‌లో హర్టికల్చర్ ప్లాంటేషన్‌ను కేంద్ర అధికారులు పరిశీలించారు. జంగంరెడ్డిపల్లెలో ప్రజలతో జలశపథం చేయించారు. డిప్యూటీ సెక్రెటరీ మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ గణేశ్‌కుమార్ బరన్వాల్, సెంట్రల్ గ్రౌండ్ వాటర్ సైంటిస్టులు ఎల్.నారాయణ, దామోదర్, అడిషనల్ డీఆర్‌డీవో మదన్‌మోహన్, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఏపీడీలు నర్సింలు, డి.గోపాలకృష్ణ, జగన్ ఉన్నారు.

మిడ్‌మానేరు సందర్శించిన జలశక్తి అభియాన్ టీం

బోయినపల్లి(చొప్పదండి): బోయినపల్లి మండలం మాన్వాడలో నిర్మించిన మిడ్‌మానేరు ప్రాజెక్టును శుక్రవారం కేంద్ర జలశక్తి అభియాన్ బృందంలోని అధికారులు సందర్శించారు. మిడ్‌మానేరు ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం, ప్రాజెక్టులోకి నీరు ఎలా వస్తుంది.. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి ఎలా అనుసంధానించారు అనే వివరాలు తెలుసుకున్నారు. ప్రాజెక్టు గేట్ల ద్వారా నీరు విడుదల చేసే ఆపరేషన్ సిస్టంను పరిశీలించారు. ప్రాజెక్టు వివరాలను మిడ్‌మానేరు ఈఈ జగన్ వివరించారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకులకు డాక్టరేట్


అంజనేయులును సన్మానిస్తున్న అధ్యాపకులు

గంభీరావుపేట(సిరిసిల్ల): కేజీ టు పీజీ విద్యాసంస్థల్లో భాగమైన గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న ముగ్గురు అధ్యాపకులు డాక్టరేట్ పురస్కారాలు అందుకున్నారు. యెలగొండ ఆంజనేయులుకు ఆంగ్ల విభాగంలో డాక్టరేట్ వచ్చింది. 'ఇన్వెస్టిగేషన్ ఆన్ ఏ మోడర్న్ కాంటెంపరరీ ఫిక్షన్ ఇన్ ఇండియన్ ఇంగ్లిష్ లిటరేచర్' అనే అంశంపై పరిశోధన చేశారు. మధ్యప్రదేశ్‌కు చెందిన సత్యసాయి యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. మరో అధ్యాపకుడు శ్రవణ్‌కుమార్ గణితశాస్త్రంలో డాక్టరేట్ సాధించారు. 'ఆన్ ఎగ్జామినేషన్ ఆఫ్ కరెంట్ ఆల్జీబ్రాక్ టెండెన్సీస్ ఫర్ ఎర్రర్ ఎలిమినేషన్ ఇన్ కౌంటబుల్ వర్క్స్' అనే అంశంపై చేసిన పరిశోధనకు జార్ఖండ్‌కు రాధాగోవింద్ యూనివర్సిటీ డాక్టరేట్‌తో సత్కరించింది. కళాశాలలో పనిచేస్తున్న ఆదివిష్ణు భౌతికశాస్త్రంలో డాక్టరేట్ అందుకున్నారు. 'స్టడీస్ ఆన్ రేడియోగ్రఫీ యూజింగ్ మోషన్ లర్నింగ్ అప్రోచెస్' అనే అంశంపై చేసిన పరిశోధనకు జార్ఖండ్‌కు రాధాగోవింద్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది.

ఇద్దరు అధ్యాపకుల రెగ్యులరైజ్

డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న లెక్చరర్లు ధర్మపురి, వాణి రెగ్యులరైజ్ అయ్యారు. డాక్టరేట్ పొందిన అధ్యాపకులను, క్రమబద్ధీకరింపబడిన అధ్యాపకులను సన్మానించారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.విజయలక్ష్మి, వైస్‌ప్రిన్సిపాల్ పిట్ల దాసు, సీనియర్ అధ్యాపకులు కృష్ణమూర్తి, శ్రీనివాస్, మనోహర్, భిక్షమయ్య, కృష్ణప్రసాద్, మహేశ్, ఉమారాణి, విజయ్, భాగ్య, శిరీష పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తాం

- ఎమ్మెల్యే రమేశ్‌బాబు


ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న జర్నలిస్టులు

వేములవాడ: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో అన్ని వర్గాలతో సమానంగా పోరాటంలో భాగస్వాములైన జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తామని వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు హామీ ఇచ్చారు. మండల కేంద్రాల్లో ఇళ్ల స్థలాలు మంజూరు చేయిస్తానని తెలిపారు. రమేశ్‌బాబును తన నివాసంలో శుక్రవారం కలసిన వేములవాడ టీయూడబ్ల్యూజే(హెచ్ 143) ఐజేయూ నూతన కార్యవర్గం సన్మానించారు. అలాగే ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు, బీసీబంధు పథకాల్లోనూ అర్హులైన జర్నలిస్టులను ఎంపిక చేస్తామన్నారు. యూనియన్ అధ్యక్షుడు కొలిపాక నర్సయ్య, ఉపాధ్యక్షుడు అజీమ్, ప్రధాన కార్యదర్శి జితేందర్, క్యాషియర్ కృష్ణారెడ్డి, గౌరవాధ్యక్షుడు సయ్యద్ లాయక్‌పాషా, జిల్లా అధ్యక్షుడు రాచర్ల లక్ష్మీనారాయణ, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వడదెబ్బతో వృద్ధుని మృతి


సత్యనారాయణ(ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని అల్మాస్‌పూర్‌కు చెందిన సిరిసిల్ల సత్యనారాయణ(70) అనే వృద్ధుడు శుక్రవారం వడదెబ్బతో మృతిచెందాడు. పనిమీద బయటకు వెళ్లిన సత్యనారాయణ ఎండదెబ్బకు లోనయ్యాడు. ఇంటికొచ్చిన అనంతరం తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న అతన్ని ఆస్పత్రికి తరలించేలోపే మరణించాడు. మృతునికి భార్య అనసూర్య, కుమారులు ప్రమోద్, వినోద్, కూతురు కవిత ఉన్నారు. కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

గుండెపోటుతో యువకుని మృతి

- నారాయణపూర్‌లో విషాదం
- రోడ్డున పడ్డ కుటుంబం


సురేందర్‌రెడ్డి (ఫైల్)


మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని నారాయణపూర్‌కు చెందిన వంగల సురేందర్‌రెడ్డి(32) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందాడు. ఈ సంఘటన స్వగ్రామంలో విషాదం నింపింది. ఒక్కాగానొక్క కొడుకు మరణించడంతో ఆ కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. సురేందర్‌రెడ్డి మృతితో భార్య, ఆరేళ్ల కూతురు దిక్కులేని వారయ్యారు. వంగల సులోచన–రాజిరెడ్డి దంపతులకు ముగ్గురు సంతానం. సురేందర్‌రెడ్డితోపాటు ఇద్దరు కూతుళ్లు. తండ్రి రాజిరెడ్డి హమాలీ పనిచేస్తుండగా.. సురేందర్‌రెడ్డి వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈక్రమంలోనే రెండు రోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు కిడ్నీ, లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు తెలిపారు. అదే రోజు ఇంటికొచ్చిన సురేందర్‌రెడ్డి మళ్లీ తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచనలతో కరీంనగర్ తరలించగా.. చికిత్స పొందుతున్న క్రమంలోనే గుండెపోటు రావడంతో ఆస్పత్రిలోనే ప్రాణాలు వదిలాడు. మృతునికి భార్య రేణ, కూతురు మున్ని(06) ఉన్నారు. కడుపేదరికం అనుభవిస్తున్న సురేందర్‌రెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

యువకుని ఆత్మహత్యాయత్నం


శ్రావణ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండల కేంద్రంలో శుక్రవారం ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు. నామాపూర్‌కు చెందిన గొడుగు శ్రావణ్ కులసంఘం చిట్టీ డబ్బులు చెల్లించడంలో జాప్యం చేస్తున్నాడని సంఘం పెద్ద మనుషులు ఠాణాలో ఫిర్యాదు చేశారని అనుమానించాడు. అంతేకాకుండా పిల్లలతో సహా ముస్తాబాద్ చేరుకొని ఒంటిపై కిరోసిన్ చల్లుకొని నిప్పు పెట్టుకునే ప్రయత్నం చేశాడు. గమనించిన స్థానికులు శ్రావణ్‌ను అడ్డుకున్నారు. పోలీసులకు సమాచారం అందించగా వారు వచ్చి అదుపులోకి తీసుకొని కౌన్సిలింగ్ ఇచ్చారు. తనను కుల పెద్దలు సంఘం నుంచి బహిష్కరించారని మనస్థాపం చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు శ్రావణ్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి చంద్రంపేట బైపాస్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. సిరిసిల్లకు చెందిన చేపూరి రాజేందర్ తన కొడుకు సంపత్‌తో కలిసి బయటకెళ్లి తిరిగి ఇంటికొస్తుండగా చంద్రంపేట బైపాస్ వద్ద కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే సిరిసిల్లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.


చేపల వంటలను చూస్తూ..


చేపల కూరను ఆస్వాదిస్తున్న కుటుంబం


స్టాల్స్ వద్ద సందడి

చేపల వంటలు అదుర్స్

నోరూరించే వంటకాలు • ఫిష్‌ఫుడ్ ఫెస్టివల్ అదుర్స్ • నేడు ముగియనున్న ఫెస్టివల్





సిరిసిల్ల: సిరిసిల్ల రైతు బజారులో ఫిష్‌ఫుడ్ ఫెస్టివల్ గుమగుమలాడే వంటకాలతో నోరూరిస్తోంది. రెండో రోజు శుక్రవారం సాయంత్రం ఫిష్‌ఫుడ్ ఫెస్టివల్ జనంతో కిక్కిరిసిపోయింది. చేపల బిర్యానీ, బొమ్మిడాల పులుసు.. రొయ్యల పకోడీ, ఫిష్ సమోసా.. ఇలా వెరైటీ వంటకాల స్టాల్స్ ఆకట్టుకున్నాయి. కొత్త రుచులను పరిచయం చేస్తూ మత్స్యశాఖ ఏర్పాటు చేసిన ఫిష్‌ఫుడ్ ఫెస్టివల్ విజయవంతమైంది. భారీ సంఖ్యలో పట్టణవాసులు వచ్చి వెరైటీ వంటకాలను రుచి చూస్తున్నారు. ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌లో ఫిష్ సమోసా, ఫిష్ సూప్స్, ఫిష్ బిర్యానీ, ప్రాన్ పకోడి, ఫిష్ బర్గర్, పీతల ఫ్రై, ఫిష్ అప్పడాలు, అపోలో ఫిష్, ఫిష్ ఫింగర్, ప్రాన్ బటర్‌ఫ్లై, ఫిష్ మంచూరియా, స్మోక్‌డ్ ఫిష్ వంటి వెరైటీ వంటకాలను పట్టణవాసులు ఆరగిస్తున్నారు. శనివారంతో ఈ ఫెస్టివల్ ముగుస్తుంది.